స్పందన కరువు...

పిజిఆర్ఎస్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ (ఫైల్)

కర్నూలు మండలం ఉల్చాల ఎస్‌సి కాలనీలో ప్రధాన రహదారిపై మురుగునీరు ఆగుతున్నాయని గ్రామస్తులు రెండు సార్లు కలెక్టరేట్‌లో జరిగిన పిజిఆర్ఎస్‌లో అర్జీలు ఇచ్చారు. సమస్య పరిష్కారం చేయాల్సిన అధికారులు సమస్య పరిష్కారం అయినట్లు చూపారు. తప్ప సమస్యను పరిష్కరించలేదు.

కర్నూలు నగరానికి చెందిన ఓ వికలాంగురాలి సదరం సర్టిఫికెట్‌లో తప్పులను సవరించాలని పిజిఆర్ఎస్‌లో అర్జీ ఇచ్చారు. సమస్య పరిష్కారం అయినట్లు చూపారు. తప్ప తప్పులను సవరించలేదు.

ఉల్చాల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పొలం వివరాలు ఆన్‌లైన్‌లో ఎర్రర్ చూపిస్తుండటంతో పొలం అమ్మినా రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి ఇబ్బంది అవుతోందని పిజిఆర్ఎస్‌లో అర్జీ ఇస్తే సమస్య పరిష్కారం అయినట్లు చూపారు కానీ వాస్తవంగా సమస్యను పరిష్కరించలేదు.

- పిజిఆర్ఎస్ అర్జీలు పరిష్కరించుకుండానే క్లోజ్
- 8 శాతం అర్జీలు రీ ఓపెన్
- సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ప్రజా సమస్యలను పరిష్కరించడం కోసం ప్రభుత్వం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కారం వేదికలో ఇచ్చే అర్జీలకు స్పందన కరువైంది. జిల్లాలో కలెక్టరేట్‌తో పాటు మండల, డివిజన్ స్థాయిల్లో నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్‌లో అర్జీలు పరిష్కరించకుండానే పరిష్కరించినట్లు చూపుతున్నారు. దాంతో అర్జీ దారులు మళ్లీ అదే సమస్య మీద ఫిర్యాదు చేస్తున్నారు. దాంతో 8.26 శాతం అర్జీలు రీ ఓపెన్ అయ్యాయి. గత ఏడాది జూన్ 16 నుంచి గత సోమవారం వరకూ జిల్లా వ్యాప్తంగా 56,754 అర్జీలు వచ్చాయి. వాటిలో వాస్తవంగా పరిష్కరించినవి సగం మాత్రమే. అర్జీ దారుడు అర్జీ ఇచ్చిన తరువాత అధికారులు వాటిని సంబంధిత సచివాలయానికి ఫార్వర్డ్ చేస్తున్నారు. క్షేత్ర స్థాయిలోని సిబ్బంది అర్జీదారులను పిలిపించి మాట్లాడి పంపుతున్నారు. సమస్య పరిష్కారం కాకున్నా పరిష్కారం అయినట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. పరిష్కారం అయినట్లు అర్జీదారుల ఫోన్‌లకు మెసేజులు కూడా వస్తున్నాయి. దీంతో అర్జీదారులు నిర్ఘాంతపోతున్నారు. కొంత మాత్రం అదే సమస్యపై మరో సారి ఫిర్యాదు చేస్తున్నారు. దాంతో అర్జీలు రీ ఓపెన్ అవుతున్నాయి. ఇప్పటి వరకూ మొత్తం 4,504 అర్జీలు రీ ఓపెన్ అయ్యాయి. వాటి లోనూ 1,264 అర్జీలు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. మొత్తం అర్జీల్లో 29 అర్జీలను సంబంధిత శాఖ అధికారులు ఇప్పటి వరకూ అసలు ఓపెన్ చేసి చూడనేలేదు. 2,222 అర్జీలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి.

సర్వే, రెవెన్యూ శాఖలవే అధికం

జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ అందిన అర్జీల్లో సర్వే సెటిల్‌మెంట్, రెవెన్యూ (సిసిఎల్ఎ) శాఖల అర్జీలే అధికంగా ఉన్నాయి. సర్వే సెటిల్‌మెంట్ శాఖకు సంబంధించి 20,781 అర్జీలు అందాయి. వాటిలో 5 శాతం అర్జీలు రీ ఓపెన్ అయ్యాయి. రెవెన్యూ శాఖకు 19,258 అర్జీలు రాగా 10 శాతం అర్జీలు రీ ఓపెన్ అయ్యాయి. వాటిలో ఇప్పటికీ 945 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయి. పోలీస్ శాఖకు 5,553 అర్జీలు రాగా 12 శాతం అర్జీలు రీ ఓపెన్ అయ్యాయి.

ఈ మండలాల నుంచే ఎక్కువ అర్జీలు

మొత్తం అర్జీల్లో కర్నూలు అర్బన్ మండలం నుంచి అత్యధికంగా 6,123 అర్జీలు వచ్చాయి. కల్లూరు మండలం నుంచి 3,894, ఆదోని నుంచి 3,250, ఓర్వకల్లు నుంచి 3,117, కర్నూలు రూరల్ నుంచి 2976 అర్జీలు వచ్చాయి. ఎమ్మిగనూరు 2,727, పెద్దకడబూరు 2,515, గోనెగండ్ల 2,355, వెల్దుర్తి 2,296, కోడుమూరు 2,295, దేవనకొండ 2,215, సి బెళగల్ 1,985, మంత్రాలయం 1,872, నందవరం 1,714, ఆస్పరి 1,673, కౌతాళం 1,604, ఆలూరు 1,567, తుగ్గలి 1,544, కోసిగి 1,292, క్రిష్ణగిరి 1,287 అర్జీలు అందాయి.

శాఖల వారీగా అర్జీల వివరాలు ఇలా..

శాఖ	మొత్తం అర్జీలు	రీ ఓపెన్ అయిన శాతం
సర్వే	20,781	5
రెవెన్యూ	19,258	10
పోలీస్	5,553	12
మున్సిపల్	2,471	14
పిఆర్	1,164	19

పరిష్కారం చేయని గ్రీవెన్స్‌లు ఎందుకు

కలెక్టరేట్‌కు వచ్చినా మున్సిపల్ కార్యాలయానికి వచ్చినా ఎవరి సమస్యలూ పరిష్కారం కావడం లేదు. సచివాలయాలకు ఫార్వర్డ్ చేస్తున్నారు. వాళ్లు సమస్య పరిష్కారం అవుతున్నట్లు నమోదు చేస్తున్నారు. సమస్యలు పరిష్కారం చేసేటట్లు అంటేనే గ్రీవెన్స్ కార్యక్రమాలు నిర్వహించాలి. లేకుంటే గ్రీవెన్స్ నిర్వహించడం వృథా.

- డి.గౌస్ దేశాయ్, సిపిఎం జిల్లా కార్యదర్శి.

ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ బోధన

- పదిలో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి
- పకడ్బందీగా మధ్యాహ్న భోజనం అమలు
- ప్రజాశక్తితో డిఈఓ శామ్యూల్ పాల్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు డిజిటల్ పాఠాలలో బోధన చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ శామ్యూల్ పాల్ తెలిపారు. పదిలో జిల్లాలో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తున్నామని, అందుకు అనుగుణంగా ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో డీఎస్సీ ద్వారా 2591 పోస్టులను భర్తీ చేశామన్నారు. డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు పూర్తిస్థాయి శిక్షణ కూడా ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. ప్రజాశక్తితో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు..

పది పరీక్షలలో ఉత్తమ ఫలితాలను సాధించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డిఈఓ : జిల్లా లో బెస్ట్ లో ఉత్తమ ఫలితాల సాధనకు ప్రత్యేకంగా ప్రణాళికను రూపొందించడం జరిగింది. ప్రభుత్వ పాఠశాలలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులను నిర్వహించాలని ఆదేశాలు జారీ చేయడం జరిగింది.

జిల్లాలో మెగా డీఎస్సీ ఉపాధ్యాయ పోస్టుల భర్తీ పక్కాగా పూర్తి అయ్యిందా?

డిఈఓ : రాష్ట్రంలోనే అత్యధికంగా ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, జిల్లాపరిషత్, ఎంపిపి యాజమాన్యాలలో మొత్తం 2547, మున్సిపల్ యాజమాన్యంలో 98, ట్రైబల్ యాజమాన్యంలో 28 పోస్టులు కలిపి మొత్తం 2678 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వడం జరిగింది. మెరిట్ ఆధారంగా తుది ఎంపిక జాబితా ప్రకటించి మొత్తం ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2591 ఖాళీలను భర్తీ చేయడం జరిగింది.

జిల్లాలో మధ్యాహ్న భోజన పథకం అమలు ఎలా చేస్తున్నారు?

డిఈఓ : డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకములో ప్రైమరీ విద్యార్థులకు జూన్ నెల నుంచి ఫైన్ రైస్ (సన్న బియ్యము) 100 గ్రాములు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల విద్యార్థులకు 150 గ్రాముల, ఇంటర్ విద్యార్థులకు 200 గ్రాముల చొప్పున అందించబడుచున్నది. ప్రతి విద్యార్థికి వారానికి 5 రోజులు గుడ్లు, 3 రోజులు చిక్కీల ఇవ్వడం జరుగుతున్నది. వీటికి అదనంగా మంగళవారం, గురువారం, శనివారం రాగి జావ ఇవ్వడం జరుగుతున్నది.

విద్యార్థులందరికీ ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ పూర్తి చేశారా ?

డిఈఓ : ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, జిల్లాపరిషత్, ఎయిడెడ్ పాఠశాలలో చదువుతున్న 1వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థులకు 2025-2026 గాను మొదటి సెమిస్టరు కింద 20,53,875 ప్రభుత్వ పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేయడమైనది. మరియు రెండవ సెమిస్టరుకు సంబంధించి 13,20,313 పాఠ్య పుస్తకములను అన్ని మండల కేంద్రములకు సరఫరా చేశాం.

జిల్లాలో తల్లికి వందనం పథకం కింద ఎంతమంది విద్యార్థుల తల్లులకు లబ్ధి చేకూరింది? ఇంకా కొంతమంది అర్హత ఉన్నా పొందలేకపోయారు ఎందుకు?

డిఈఓ : జిల్లాలోని పాఠశాలలో 1 నుండి 12 తరగతులకు వరకు చదువుతున్న పేద కుటుంబాలకు చెందిన 41,7688 మంది విద్యార్థుల తల్లులకు అర్హత ఉన్న వారికి డబ్బులను జమ చేశాం. అర్హత కలిగి కూడా తల్లికి వందనం లబ్ధిచేకూరని వారు, సంబంధిత గ్రామ సచివాలయాల్లో తగిన ధ్రువపత్రాలతో సంప్రదించినచో వారికి కూడా లబ్ధిచేకూర్చే విధంగా తగు చర్యలు తీసుకున్నాం.

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు డిజిటల్ బోధన ఎలా జరుగుతోంది?

డిఈఓ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ పాఠాల బోధనకు అనేక చర్యలు తీసుకోవడం జరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో సహ ఉపాధ్యాయుల కొరతను తీర్చడానికి విద్యార్థులు విద్యలో పురోగతి గణనీయంగా అభివృద్ధి చెందడానికి దూర ప్రాంతాల్లో ఉన్న వారికి వి లర్న్ స్టూడియో ఎంతగానో దోహదపడుతుంది. డిజిటల్ స్టూడియో యొక్క ఆలోచన విద్యార్థులను వివేచనాత్మక మనుస్సులతో బలమైన వ్యక్తులుగా ఎదగడానికి మరియు తక్షణ సౌకర్యాలతో పేదలను చేరుకోవడం, వర్చువల్ లెర్నింగ్ ద్వారా, విద్యార్థుల అవసరాలు మరియు అభ్యాస శైలులను మరింత సమర్థవంతంగా తీర్చగలం. మెరుగైన భాగస్వామ్యం మరియు మెరుగైన విద్యను మెరుగుపరచడానికి వి లర్న్ ప్లాట్‌ఫామ్ ద్వారా అందించుటకు చర్యలు తీసుకుంటున్నాం.

మొక్కజొన్న క్వింటాకు రూ.2,500 ఇవ్వాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మొక్కజొన్న పంటకు రూ.2500 మద్దతు ధర కల్పించాలని ఎపి రైతు సంఘం మండల కార్యదర్శి మధుసూదన్ డిమాండ్ చేశారు. ఆదివారం ఓర్వకల్లు మండలంలోని నన్నూరు గ్రామంలో మొక్కజొన్న పంటను ప్రతినిధి బృందం పరిశీలించింది. మండల కార్యదర్శి ఎస్ మధుసూదన్, ప్రజాసంఘాల కార్యకర్తలు సలాంబాష, శ్రీనివాసులు, హరి మొక్కజొన్న రైతులు బొజ్జన్న పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూములను వేలకు వేలు పోసి కౌలుకు తీసుకొని ఎకరాకు రూ.50 వేల పెట్టుబడి పెట్టి మొక్కజొన్న వేశారన్నారు. అతివృష్టి అనావృష్టి వల్ల పంట దిగుబడి తగ్గిందన్నారు. రేటు చూస్తే రైతులు ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి క్వింటాలుకు రూ.2500 మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

మొక్కజొన్నలను పరిశీలిస్తున్న నాయకులు

ఇద్దరు రైతుల ఆత్మహత్య

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లా ఓర్వకల్లు, హాలహర్వి మండలాల్లో సాగుకు చేసిన అప్పులు తీర్చలేక ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఓర్వకల్లు మండలంలో కౌలురైతు, హాలహర్విలో మరో రైతు తనువు చాలించారు. ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామంలో కళ్లెం బాలరాజు(35) ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఓర్వకల్లు ఎస్ఐ సునీల్ కుమార్ తెలిపిన వివరాల మేరకు. బాలరాజుకు చెందిన ఎకరాపొలంతో పాటు కౌలుకు తీసుకుని సాగు చేసుకునేవాడు. సాగు నిమిత్తం దాదాపుగా రూ.ఆరు లక్షలు అప్పులు చేశాడు. పంటల సాగుకు చేసిన అప్పులు తీర్చుకోలేక ఇంట్లో ఎవరులేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. హాలహర్వి మండలం సిద్దాపురం గ్రామానికి చెందిన రైతు తిమ్మప్ప(45) రెండున్నర ఎకరాల పొలం కౌలుకు తీసుకొని మిరప, మొక్కజొన్న సాగు చేశాడు. సాగుకోసం ఆయన ఐదు లక్షలకు పైగా అప్పులు చేశాడు. గత ఏడాది మిరప నష్టం రావడంతో చేసిన అప్పులు తీర్చలేక మనస్థపానికి గురయ్యాడు. ఈ ఏడాది కూడా దిగుబడి ఆశాజనకంగా లేదు. అప్పులు ఇచ్చిన వారు చెల్లించాలని ఒత్తిడి చేశారు. శనివారం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగాడు. స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు తెలపడంతో హుటాహుటిన బళ్లారి ఆసుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతు ఆదివారం తెల్లవారి మృతి చెందాడు. మృతుని భార్య ఈరమ్మ, నలుగురు కొడుకులు ఉన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతు తిమ్మప్ప కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా, మండల రైతుసంఘం నాయకులు పి. హనుమంతు, ఈరన్న డిమాండ్ చేశారు.

రైతు తిమ్మప్ప (ఫైల్)

మృతి చెందిన కౌలు రైతు కళ్లెం బాలరాజు

సేవాభావాలు అందిపుచ్చుకోవాలి

- డిప్యూటీ కలెక్టర్ ప్రసన్న లక్ష్మి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

గ్రంథాలయాల కోసం తమ ఆస్తులు ప్రాణాలను అర్పించిన వారి త్యాగాలను స్మరించుకుంటూ వారి సేవలను అందిపుచ్చుకోవాలని డిప్యూటీ కలెక్టర్ ప్రసన్న లక్ష్మి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా గ్రంథాలయ ఉద్యమ నాయకులను స్మరించుకొను కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిప్యూటీ కలెక్టర్ ప్రసన్న లక్ష్మి,డిఇ పి.ప్రేమ కుమారి, సైనిక్ వెల్ఫేర్ అధికారి ఎస్ఆర్. రత్నరూత్ , రామమోహన్ ,ముచ్చుకోట చంద్రశేఖర్, ఎఫ్ఎసి కార్యదర్శి వి.పెద్దక్క, సహాయ గ్రంథాలయ అధికారి వజ్రాల గోవిందరెడ్డి పాల్గొన్నారు. గ్రంథాలయ అధికారులు వి.గోవిందరెడ్డి, ఎన్.బాష, నషీమా బీ, రేణుక, పద్మావతమ్మ, ఈశ్వరమ్మ, ఉమ తదితరులు పాఠశాలల విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

నివాళ్లులర్పిస్తున్న డిప్యూటీ కలెక్టర్ ప్రసన్న లక్ష్మి

పత్తి ఓబులయ్యను సన్మానిస్తున్న దృశ్యం

ఉర్రూతలూగించిన పల్లె పాట

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్ : టిజివి కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గజ్జె కట్టిన పల్లె పాట అనే అంశంపై జానపద నృత్య సంగీత విభావరి నిర్వహించారు. అనంతపురం నుంచి వచ్చిన పరిమళ రాజు బృందం అనేక జానపద పాటలకు నృత్యం చేసి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఉస్మాన్ బాష తన మిమిక్రీతో మాజీ సిఎంలు వైఎస్.రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య, ఎన్‌టిఆర్ స్వర్గంలో కలిసి మాట్లాడు మాట్లాడుకున్నట్లుగా చక్కని హాస్యపూరితమైన వారి స్వరాలను అనుకరిస్తూ మిమిక్రీ చేశారు. ఎమ్మిగనూరు వచ్చిన ఖాజావలి బృందం జానపద గీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా కళా రత్న పత్తి ఓబులయ్యను జన విజ్ఞాన వేదిక తరపున వి శేషాద్రిరెడ్డి, శేషాద్రిరెడ్డి, బి.శ్రీరాములు తదితర జిల్లా కార్యవర్గం సన్మానించింది. ఈ కార్యక్రమంలో కార్యదర్శి యాగంటి ఈశ్వంచ్, కెవి రమణ, సివి.రెడ్డి తోపాటు అనంతపురం కర్నూలు జిల్లా కళాకారులు పాల్గొన్నారు.

సివిల్ సర్వీసెస్ ఉచిత శిక్షణకు దరఖాస్తులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : సాంఘిక సంక్షేమ శాఖ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో యుపిఎస్‌సి, సివిల్స్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పరీక్ష 2026 కు మెయిన్స్ పరీక్షలకు ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్ నిర్వహించనున్నారు. ఇందుకోసం అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన బిసి, ఎస్‌సి, ఎస్‌టి, ఒసి, పడబ్ల్యుడి అభ్యర్థులు అర్హులు అని, ఈ నెల 26 వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని అభ్యర్థులు వినియోగించుకోవాలని కోరారు.

నేడు నగరపాలక ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమం సోమవారం ఉదయం 10:30 గంటలకు స్థానిక ఎస్‌బిఐ ఎంప్లాయీస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో నిర్వహించనున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి నగరపాలక సంస్థకు చెందిన అన్ని విభాగాల అధికారులు హాజరు అవుతారని, కాలనీల్లోని మౌలిక వసతులు, రహదారులు, డ్రైనేజీ, వీధి వెలుగులు, పరిశుభ్రత వంటి సమస్యలను ప్రజలు లిఖిత పూర్వకంగా సమర్పించవచ్చని తెలిపారు. ప్రతి ఫిర్యాదు స్వీకరించిన వెంటనే సంబంధిత అధికారులకు పంపి, పరిష్కారం కోసం నిర్దిష్ట గడువులు నిర్ణయిస్తామని ఆయన వెల్లడించారు. అదేవిధంగా, ప్రతి ఫిర్యాదు పురోగతిని పౌరులు స్వయంగా https:Meekosam.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని కమిషనర్ వివరించారు.

సీమ అభివృద్ధికి ఉద్యమించాలి

- సదస్సులో పలువురు వక్తలు

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ ప్రాంతం అభివృద్ధికి ఉద్యమించాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆదివారం కర్నూలు నగరంలోని కృష్ణకాంత్ ప్లాజాలోని బ్రహ్మారెడ్డి ఆసుపత్రిలో రాయలసీమ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. రాష్ట్ర కమిటీ సభ్యులు రత్నం అధ్యక్షతన జరిగిన సదస్సు ముఖ్య అతిథిగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఇ.వెంకటేశం, ప్రముఖ ఆర్థిక విశ్లేషకులు డాక్టర్ మన్సూర్ రహ్మాన్ పాల్గొన్నారు. ఈ వెంకటేశం మాట్లాడుతూ రాయలసీమకు రెండు వందల ఏళ్లుగా బ్రిటిష్ కాలంనుండి అన్యాయం జరుగుతుందన్నారు. పాలకులు కోస్తా ప్రాంతం పైనే శ్రద్ధ పెడుతూ, రాయలసీమను నిర్లక్ష్యం చేస్తూ వున్నారన్నారు. ప్రభుత్వం అభివృద్ధి మొత్తం అమరావతి, విశాఖ కేంద్రంగా చేస్తుందన్నారు. రాయలసీమలో ప్రాజెక్టులు నిర్లక్ష్యం చేయబడుతున్నా యని విమర్శించారు. సీమ రైతులు, విద్యార్థులు, సీమ ప్రజాసంఘాలు ఉద్యమిస్తేనే ఉజ్వల భవిష్యత్తు వుంటుందని, లేకుంటే మరింత అన్యాయానికి గురవుతుందన్నారు. డాక్టర్ మన్సూర్ రహమాన్ మాట్లాడుతూ ఏ ఆర్థిక, రాజకీయ, పారిశ్రామిక గణాంకాలు తీసుకున్నా, రాయలసీమ వెనుకబాటు తనంలో వుందన్నారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పడినప్పటి నుండి ఇంత వరకు రాయలసీమ నేతలే ముఖ్యమంత్రులుగా పనిచేసి నప్పటికీ, రాయలసీమ వెనుకబడి పోవడం విచారకరమన్నారు. వ్యవసాయ రంగాన్ని, పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేస్తేనే కరువులు వలసలు తగ్గిపోతాయన్నారు. ఆ దిశగా రాయలసీమ ఉద్యమాలను బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు, శేషాద్రిరెడ్డి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు సురేష్, రైతుకూలీ సంఘం నాయకులు సుంకన్న, యోహాన్, రామకృష్ణారెడ్డి, యువజన నాయకులు నగేష్, లెక్చరర్ రవి ప్రకాశ్, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ ఐక్య వేదిక అధ్యక్షులు రవి కుమార్, పౌరహక్కుల సంఘం నాయకులు అల్లాబకాష్, విరసం బాధ్యులు నాగేశ్వరాచారి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం విజయవంతం

- 7వ రోజు ప్రెస్ డేతో ముగింపు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కెవిఆర్ గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ (గర్ల్స్), కర్నూలు ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్టాంటన్‌పురం గ్రామంలో నిర్వహించిన ఏడు రోజుల ప్రత్యేక శిబిరం ఆదివారం విజయవంతంగా ముగిసింది. వాలెడిక్టరీ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎస్.రెష్మా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.వారం రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమాల్లో ప్రజలకు, మహిళల జీవన సరళిపై అవగాహన కల్పించారు. సరిసరాల పరిశుభ్రత ప్రాధాన్యతను తెలిపారు.

మొదటిరోజు ప్రారంభ శిబిరం, అవగాహనర్యాలీలో ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. రెండో రోజు పర్యావరణ పరిరక్షణ అండ్ సామాజిక అవగాహన కల్పించారు. పిల్లలకు శుభ్రత ప్రాముఖ్యతను తెలిపారు. మూడోరోజు స్టాంటన్‌పురం చర్చి ప్రాంగణంలో స్థానిక వైద్యుల సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. నాలుగోరోజుహెల్త్ అండ్ హైజిన్ సెషన్ నిపుణులతో బాలికల ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఐదో రోజు మొక్కల నాటే కార్యక్రమంలో కర్నూలు డిఎస్‌పి మహబూబ్ బాషా పాల్గొన్నారు. ఆరవ రోజుప్రతిజ్ఞలు, మనవహారం అండ్ సైబర్ భద్రత సెషన్ వాలంటీర్లు గ్రామస్తులతో కలిసి 'స్వచ్ఛ ఆంధ్ర అంధ్ర, స్వర్ణ ఆంధ్ర' ప్రతిజ్ఞ చేశారు. ఎఎస్ఐ విజయ కిరణ్ బాలికలకు సైబర్ క్రైమ్, మహిళా భద్రత, చట్టపరమైన రక్షణలపై అవగాహన ఇచ్చారు.

ఏడవ రోజు వాలెడిక్టరీ కార్యక్రమం

చివరి రోజు శిబిర సమీక్ష, వాలంటీర్ల అనుభవాలు, అతిథుల సందేశాలతో వాలెడిక్టరీ కార్యక్రమం నిర్వహించారు. వక్తలు ఎన్ఎస్ఎస్ శిబిరాలు యువతలో సేవాభావం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తాయని అభినందించారు. గ్రామాభివృద్ధిలో విద్యార్థుల పాత్ర అమూల్యమని పేర్కొన్నారు. అభినందనలు తెలుపుతూ సర్టిఫికేట్లను ప్రదానం చేశారు. చివరి రోజు ఆదివారం జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించు కొని ప్రజాశక్తి ఎడిషన్ ఇన్‌ఛార్జి పానుగంటి చంద్రయ్యకు, సీనియర్ పాత్రికేయులు పి.యూసఫ్ ఖాన్‌కు, స్టాఫర్ వినయ్‌కుమార్‌కు, ప్రింటింగ్ విభాగం సుబ్బరాయుడులను ఘనంగా సన్మానించారు. పానుగంటి చంద్రయ్య ప్రెస్‌డే ప్రాధాన్యతను వివరించారు. ప్రింటుమీడియాలో ప్రింటింగ్ యంత్రం ఏర్పడినప్పటినుంచి ఇప్పటివరకు వచ్చిన సాంకేతిక మార్పులను, హాండ్ కంపోసింగు నుంచి కంప్యూటర్ యుగంవరకు మార్పులను వివరించారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎస్.రెష్మా శిబిరం విజయవంతానికి సహకరించిన గ్రామపెద్దలు, అధ్యాపకులు, వైద్యులు, పోలీసు అధికారులు, వాలంటీర్లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రవిచరణ్, అధ్యాపకులు రవిగుప్త, శివయ్య, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ నూరుళ్లా తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ప్రెస్ డే సందర్భంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో సీనియర్ జర్నలిస్టులు చంద్రయ్య, యూసఫ్‌ఖాన్ , వినయ్‌కుమార్లకు సన్మానం

సుందరీకరణను పాడు చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు నగరంలోని కూడళ్లపై, డివైడర్లపై, ప్రభుత్వ ఆస్తులపై పోస్టర్లు, బ్యానర్లు అతికించడం, గోడలపై రాతలు రాయడం వంటి చర్యలు నగర సుందరీకరణను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనను విడుదల చేశారు. నగరంలోని ముఖ్య కూడళ్లలో, డివైడర్ల మధ్య స్తంభాలపై, గోడలపై రాజకీయ పార్టీలు, మత సంస్థలు, ప్రైవేటు సంస్థలు, బ్యానర్లు, సినిమా పోస్టర్లు అతికించడం వల్ల లక్షలాది రూపాయల ప్రజాధనంతో చేపట్టిన సుందరీకరణ పనులు పాడు అవుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలు సైతం చట్ట విరుద్ధ చర్యలను అడ్డుకోవాలని కోరారు. ట్రాఫిక్ సిగ్నల్స్, సిసి కెమెరాల వద్ద బ్యానర్లు అడ్డుగా ఉండటం వల్ల ట్రాఫిక్ అంతరాయం, ప్రమాదాలు సంభవించిన సందర్భాల్లో విచారణకు అవసరమైన కెమెరా దృశ్యాలు దొరకకపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నా యని కమిషనర్ తెలిపారు. నగర సుందరీకరణను కాపాడేందుకు ప్రతి సంస్థ నగరపాలక సంస్థకు సహకరించాల్సిన బాధ్యత ఉందని సూచించారు. దీనిని ఎవరైనా అతిక్రమించి నగర సుందరీకరణ పనులకు భంగం కలిగిస్తే, మున్సిపల్ కౌన్సిల్ సిఆర్ నెం:78 ప్రకారం భారీ జరిమానాతో పాటు చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్

ప్రజాశక్తి - సి బెళగల్ : సి బెళగల్ లోని రౌడీ సీటర్లకు ఎస్సై వేణుగోపాల్ రాజు ఆదివారం కౌన్సిలింగ్ ఇచ్చారు. నేర ప్రవత్తి నుండి బయట పడి ప్రశాంత జీవనం గడపాలని అన్నారు. అలాగే ఆవేశం తగ్గించుకొని ఆలోచన పరంగా సమస్యలు పరిష్కరించుకోవాలని లేదంటే పోలీసులను ఆశ్రయించాలని పేర్కొన్నారు. కుటుంబంలో పిల్లలను చదివించుకొని మంచి స్థాయిలో చూడాలని తెలిపి ప్రవర్తనలో సత్రప్రవర్తన మార్పు దిశగా వెళ్లాలని లేదంటే శిక్షార్హులు కాక తప్పదని హెచ్చరించారు.

నదిలో గుర్తుతెలియని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - సి బెళగల్ : మండలంలోని ముడుమాల గ్రామం తుంగభద్ర నదిలో ఆదివారం గుర్తుతెలియని మగ శవం లభ్యం అయినట్లు ఎస్సై వేణుగోపాల్ రాజు తెలిపారు. శవం పూర్తిగా నశించి, కుళ్ళి పోయి ఉండగా కర్నూల్ నుండి ఫోరెన్సిక్ ప్రొఫెసర్ బ్రాహ్మాజీ ఇక్కడికే వచ్చి పోస్టుమార్టం నిర్వహించారు. శవం ఎడమ బుజంపై ఎస్‌యు అని ఉందని, ఎత్తు 172 సెంటిమీటర్లు ఉన్నాడని తగు ఆచూకీ కోసం సంప్రదించాలన్నారు.

నేడు కలెక్టరేట్లో గ్రీవెన్స్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్ : ప్రజా సమస్యలు పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమం కలెక్టరేట్లో సోమవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టరేట్‌తో పాటు అన్ని రెవెన్యూ డివిజన్ మున్సిపల్ మండల కేంద్రాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

- జి.అబ్దుల్ హమీద్

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్ : శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మైనార్టీ సంస్థ టౌన్ ప్రెసిడెంట్ జి.అబ్దుల్ హమీద్ అన్నారు. స్థానిక పెద్ద మార్కెట్ సమీపంలో ఉన్న మున్సిపల్ పార్క్ మైదానంలో తైక్వాండో శిక్షణా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. తైక్వాండో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. ఆయన మాట్లాడుతూ తైక్వాండో ఆత్మరక్షణ క్రీడని, నేటి సమాజంలో చదువుతోపాటు క్రీడల్లో కూడా విద్యార్థులు రాణించాలని, మొబైల్ ఫోన్లకు సెల్ఫోన్లకు దూరంగా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో సీనియర్ శిక్షకులు టి.వెంకటేశ్వర్లు, టి.అజయ్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అబ్దుల్ హమీద్

నూతన కొళాయికి దబ్బులెందుకు ?

- టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మాధవరావు దేశాయ్

ప్రజాశక్తి-నందవరం

నూతన కొళాయి కలెక్షన్ కోసం ప్రజల దగ్గర నుండి డబ్బులు వసూలు చేయటం దుర్మార్గమని టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ మాధవరావు దేశాయ్ విమర్శించారు. ఆయన ఆదివారం గ్రామంలో వివిధ వీధులను తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. గత రెండు రోజులుగా అధికారులు గ్రామ ప్రజల దగ్గర ఒక్కో కొళాయికి రూ.5వేల చొప్పున వసూలు చేస్తున్నారని విమర్శించారు. జల్ జీవన్ మిషన్ కింద ప్రజల దగ్గర నుండి ఒక్కరూపాయి వసూలు చేయకుండా ఉచిత కొళాయిని ఇవ్వాలని ప్రభుత్వం తెలిపిందన్నారు. చాలా సందర్భాలలో ఆ విషయాన్ని ప్రజలకు కూడా తెలిపామన్నారు. ఉచిత కొళాయి ఇవ్వకుండా అధికారులు డబ్బులు వసూలు చేయటం ఏమిటని ప్రశ్నించారు. కలెక్షన్లను ఇచ్చే విషయంలో అధికారులు, గ్రామ పాలకులు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆయన మండిపడ్డారు. గ్రామంలో కులాయి కొన్ని వార్డులకు మాత్రమే డబ్బులు వసూలు చేస్తున్నట్లు, వేరే వార్డుకు సంబంధించిన వ్యక్తులు వెళితే వారిని వాపసు పంపినట్లు ఆయన చెప్పారు. కొళాయి కనెక్షన్లు ఇస్తే గ్రామంలో ప్రతి వీధికి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. జల్ జీవన్ మిషన్ పథకాన్ని నిర్వీర్యం చేశారని మండిపడ్డారు.

- స్థానికులతో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మాధవరావు దేశాయ్

వైసిపి పాలనలో గ్రామ అభివద్ధి శూన్యం

వైసిపి పాలనలో గ్రామాభివృద్ధి నిలిచిపోయిందన్నారు. గ్రామంలో ఎటు చూసినా తాగునీటి ఎద్దడి ఏర్పడిందని, బీసీ కాలనీలో నీటి కొరత విపరీతంగా ఉందని, ఆ వీధికి నీటిని అందించటానికి వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టామన్నారు. దాని నిర్మాణం పూర్తయి సుమారుగా యేడేళు కావచ్చిందన్నారు. దాని ద్వారా నీటిని సరఫరా చేయటానికి అధికారులు, గ్రామ పాలకులు ప్రయత్నం చేయకపోవడం దురదదృష్టకరమని తెలిపారు. ట్యాంక్ ఉన్న ప్రదేశంలో బోరు వేయించామని, మూడు ఇంచులు నీరు పడ్డాయన్నారు. దాన్ని కూడా నీరుపయోగంగా ఉంచారన్నారు. ప్రజలపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్న పాలకులు, వారికి వత్తాసు పలుకుతున్న అధికారులను ప్రజలు చీదరించుకుంటున్నారన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో గ్రామాభివద్ధికి తోడ్పడే నాయకున్ని ఎన్నుకోవాలని ఈ సందర్భంగా ప్రజలను కోరారు. గ్రామంలో తాను సర్పంచిగా ఉన్న సమయంలో చాలా వీధులలో సిసి రోడ్లు, డెయినేజీలు నిర్మాణం చేపట్టామన్నారు. మా హయాంలో కొన్ని వీధులకు ఇంటింటి కొళాయిలు ఇచ్చామన్నారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వీధిలో గుంత కూడా పూడ్చ లేకపోయారన్నారు. మేము నిర్మించిన వాటర్ ట్యాంకును, విలేజ్ మార్కెట్, పార్కును గ్రామ పాలకులు నిర్వీర్యం చేశారన్నారు. మేము చేసిన అభివృద్ధి అక్కడికె నిలిచిపోయిందన్నారు. గ్రామం అభివృద్ధి చెందాలంటే ప్రజలు గమనించి సరైన నాయకుడిని ఎన్నుకోవాలని సూచించారు. టిడిపి మండల కార్యదర్శి లచ్చప్ప, బంగారి, మోహన్, వీరేష్, రియాజ్ పాల్గొన్నారు.

వాల్మీకుల 'ఎస్‌టి' సాధనకు లక్ష మందితో బహిరంగ సభ

ఎమ్మెల్సీ బిటి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని : వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు త్వరలోనే ఆంధ్ర రాష్ట్రంలో లక్ష మంది వాల్మీకులతో ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు అనే నినాదంతో భారీ బహిరంగ సభకు శ్రీకారం చుట్ట బోతున్నామని వాల్మీకులందరూ ఏకమై ఎస్టీ సాధన కోసం రావాలని ఎమ్మెల్సీ బీటీ నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం ఆదోని పట్టణంలోని జేపీ గార్డెన్లో ఏర్పాటుచేసిన వాల్మీకుల వనభోజనానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బీటీ నాయుడు మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తూ 2017లో డిసెంబర్ 12వ తేదీన అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆమోదం తెలిపి కేంద్రానికి పంపడం జరిగిందని, అయితే గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో వాల్మీకుల ఎస్టీ సాధన అక్కడికి ఆగిపోయింది అన్నారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ అధికారంలో ఉండడంతో రాబోవు రోజుల్లో వాల్మీకుల ఎస్టీ సాధన కొరకు రాష్ట్రంలోని వాల్మీకులు అందరితో కలిసి త్వరలోనే భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు అనే నినాదంతో సభను ఏర్పాటు చేసి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడులను సభకు పిలిచి ఎస్‌టి సాధన కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పార్థసారథి, మున్సిపల్ చైర్ పర్సన్ సిహెచ్ లోకేశ్వరి, గుడిసె కృష్ణమ్మ, ఆరికల్ రామకృష్ణ, నాయకులు ు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బిటి నాయుడు

రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కావాలి

ప్రజాశక్తి- ఎమ్మిగనూరు

రాయలసీమ అభివృద్ధికి వెంటనే ప్రత్యేక నిధులు కేటాయించాలని ప్రజా సంఘాల నాయకులు గణేష్ ,బతుకమ్మ పేర్కొన్నారు. ఆదివారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ బాగ్ ఒప్పందాన్ని అమలు చేయాలన్నారు. ఒక ప్రాంతంలో రాజధాని మరో ప్రాంతంలో హైకోర్టు ఏర్పాటు చేయాలన్నారు. ఎంపిక చేసుకునే హక్కు రాయలసీమకు ఉండాలని, కృష్ణ తుంగభద్రలలో నీటి వినియోగంలో రాయలసీమకు నిఖల జలాల వాటా కేటాయించాలన్నారు. అందుకు అనుగుణంగా నీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలని, రెండు ప్రాంతాల మధ్య సాంఘిక ,సాంస్కృతిక, సమానత్వాన్ని సాధించేందుకు విద్యా కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఒక కేంద్రాన్ని అనంతపురంలో ఏర్పాటు చేయాలని, సీమ, కోస్తా ఆంధ్రకు సమానంగా నియోజకవర్గాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇలాంటి పరిస్థితిని ముందే ఊహించిన మన రాయలసీమ పెద్దలు పప్పూరు రామాచార్యులు, కల్లూరు సుబ్బారావు, రాయలసీమ భవిష్యత్తు కోసం 1937 సంవత్సరంలో శ్రీబాగ్ ఒప్పందం తీసుకొచ్చారు. రాయలసీమ హక్కుల ఒడంబడిక మీదనే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందన్నారు. ఆ ఒప్పందంలోని ఏ నియమాన్ని ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. నేడు రాయలసీమ ఎడారి సీమగా వలస సీమగా మారిందన్నారు. మాల మహానాడు నరసన్న, ఎల్ఎల్‌సి కాలువ స్థిరీకరణ కన్వీనర్లు ఎం.స్వామి దాసు, ఎం.నాగరాజు, సిపిఎంఎల్ న్యూ డెమోక్రసీ సహాయ కార్యదర్శి సత్తన్న ,ఐఎఫ్‌టియు బాలరాజు ,బాబు ,నతానియలు ఎమ్మార్పీఎస్ ప్రతాప్, నాగన్న పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్నవివిధ ప్రజాసంఘాల నాయకులు

విజ్ఞానానికి పుట్టినిల్లు గ్రంధాలయం

ఫొటో చిత్ర పటానికి నివాళి అర్పించిన దశ్యం

ప్రజాశక్తి-ఆదోని

విజ్ఞానానికి గ్రంథాలయాలు పుట్టినిల్లు లాంటివని పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి ఆశాజ్యోతి తెలిపారు. ఆదివారం గ్రంథాలయం లో గ్రంథాలయాధికారి ఆశ జ్యోతి ఆధ్వర్యంలో గ్రంథాలయ ఉద్యమంలో పాలుపంచుకున్న డాక్టర్ రంగనాథన్, ఐఎన్‌జి. వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కాలనుగుణంగా మారుతున్న సాంకేతికపరమైన సమాచారం గ్రంథాలయంలో అందుబాటులో ఉందన్నారు. అన్ని రకాల పుస్తకాలు దినపత్రికలు ఉన్నాయన్నారు. పోటీ పరీక్షలకు కావలసిన మెటీరియల్ అందుబాటులో ఉందని, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రామకృష్ణ, ఆంజనేయులు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యమకారులు స్ఫూర్తి

- గ్రంథాలయ అధికారి వై.శివరామ ప్రసాద్

నందవరం : గ్రంథాలయ ఉద్యమకారుల స్ఫూర్తితో మనం కొనసాగాలని గ్రంథాలయ అధికారి వై.శివరామ ప్రసాదు తెలిపారు. గ్రంథాలయాల అభివృద్ధికి అయ్యంకి వెంకట రమణయ్య, పాతూరి నాగభూషణం, ఆర్.రంగనాథన్, గాడిచర్ల హరి సర్వోత్తమరావులు అలుపులేని పోరాటం చేసారని కొనియాడారు. గ్రంథాలయంలో ఆదివారం వారి చిత్రపటాలకు పూలమాల లేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమకారులు గ్రామీణ ప్రాంతాల్లో తిరుగుతూ పుస్తకాల గురించి ప్రజలకు తెలియజేశారన్నారు. మనం పుస్తకాలను చదివి జ్ఞానాన్ని సంపాదించుకోవాలని ఆయన సూచించారు.

మాట్లాడుతున్న గ్రంథాలయ అధికారి ఆశాజ్యోతి

బాలికలకు వ్యాసరచన పోటీలు

దేవనకొండ : గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా దేవనకొండ కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో చాచా నెహ్రూ గురించి వ్యాసరచన పోటీలు బాలికలకు గ్రంథాలయాధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రంథాలయ ఉద్యమ పితామహులు గాడిచర్ల హరి సర్వోత్తమ రావు, అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్ఆర్ రంగనాథన్ స్మరించుకున్నారు.కేజీబీవీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సునీత, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు వల్ల మేథో సంపత్తి పెరుగుతుంది

సర్పంచ్ దాసరి గోవిందరాజులు

చిప్పగిరి: గ్రంథాలయాల వలన ప్రతి ఒక్కరికి మేథోసంపతి పెరుగుతుందని, ముఖ్యంగా విద్యార్థులకు ఎంతో దోహదం చేస్తాయని సర్పంచి దాసరి గోవిందరాజులు, గ్రంథాలయ అధికారి అబ్దుల్ రసూల్ అన్నారు. చిప్పగిరి గ్రంథాలయ కార్యాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్స వాల్లో భాగంగా గ్రంథాలయ ఉద్యమ కారులను స్మరించుకొని వారు చేసిన త్యాగాలను విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయ వారోత్స వాలకు ముఖ్యఅతిథిగా సర్పంచి గోవిందరాజులు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథాలయాలలో పురాతనమైన పుస్తకాల ద్వారా ఎన్నో కొత్త సమాచారం తెలుసుకొనుటకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. గ్రంథాలయాలకు ప్రతిరోజువచ్చి ఒకగంట సమయం వెచ్చించి పుస్తకాలను చూసే అలవాటు చేసుకోవడం మంచిదన్నారు.

గ్రంథాలయ వారోత్సవం నందవరంలో ....చిప్పగిరిలో .....దేవనకొండలో

పోలీసు ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు సన్మానం

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండల కేంద్రమైన గోనెగండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల పోలీసు బృందం ఆధ్వర్యంలో గోనెగండ్ల మండలం నుంచి పోలీసులుగా ఎంపికైన అభ్యర్థులకు అభినందన సభ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి గోనెగండ్ల పాటు మండల పరిధిలోని కులుమాల, ఐరన్ బండ, గంజిహళ్లి, ఎర్రబాడు, తిప్పనూరు, అల్వాల, బైలుప్పల గ్రామాల నుంచి పోలీసు ఉద్యోగాలకు ఎంపికైన 25 మంది అభ్యర్థులతో పాటు తల్లిదండ్రులు కూడా హాజరయ్యారు. ముందుగా ఎంపికైన పోలీస్ అభ్యర్థులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు.రిటైర్డ్ ఎస్ఐ అచ్చుగట్ల షరీఫ్ మాట్లాడుతూ మండలం నుంచి 25 మంది పోలీసులుగా ఎంపికై తల్లిదండ్రులకు కలలను సాకారం చేసి పుట్టిన ఊరుకు మంచి పేరు తేవడం పట్ల అభినందనలు తెలిపారు. శిక్షణ ఏ విధంగా ఉంటుంది, ఉద్యోగ విధి నిర్వహణలోఎలా వ్యవహరించాలి అనే అంశాలపై వివరించారు.పోలీసు ఉద్యోగుల తరపున కార్యక్రమ నిర్వాహకులు షేక్షావలి, మాబు, పెద్దయ్య, అలీ గౌడ్,ఖలీల్, శాంత కుమార్, బక్తర్ బాబా సీనియర్ ఉపాధ్యాయులు రామన్ పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణను అడ్డుకుంటాం

ప్రజల సంతకాలతో పాలకులకు బుద్ధి చెబుతాం- బజారి రెడ్డి, నజీర్ అహమ్మద్

ప్రజాశక్తి-ఎమ్మిగనూరు

ప్రజల ఆరోగ్య హక్కులను అమ్మకానికి పెట్టే కూటమి టిడిపి ప్రభుత్వ తీరుకు తగిన మూల్యం తప్పదని వైసిపి సీనియర్ నాయకులు -బి బజారి రెడ్డి, మున్సిపల్‌వైస్ చైర్మన్‌డి.నజీర్ అహమ్మద్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని 16వ వార్డు ఇన్చార్జ్ బి. బజారి రెడ్డి , డి. నజీర్‌అహమ్మద్ 15వ వార్డు ఇన్చార్జ్ సయ్యద్ ఫయాజ్ వార్డు నాయకులు ప్రజలతో కలిసి ఏక స్వరంగా నినదించారు. ప్రజల మెడికల్ కళాశాల ప్రజల చేతుల్లోనే ఉండాలి వార్డు అంతా ప్రతి ధ్వనించేలా నినాదాలు ప్రజల సంకల్పానికి ప్రతీకలు..ప్రతి సంతకం ఒక గళం, ప్రతి గళం ఒక హామీ ప్రభుత్వ మెడికల్ కళాశాల కోసం ప్రజల పోరాటం ఇక వెనక్కి తగ్గదు.

సర్వేయర్స్ ప్రెసిడెంట్‌గా గాది లింగన్న

ప్రజాశక్తి- పత్తికొండ

పత్తికొండ ఆర్‌డిఒ కార్యాలయంలో పత్తికొండ డివిజన్ సర్వేయర్ ఎలక్షన్ అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆదివారం పత్తికొండ డివిజన్ సర్వేయర్ ప్రెసిడెంట్ గా ఎస్‌జి. గాది లింగన్న, వైస్ ప్రెసిడెంట్ గా బాలకృష్ణ , సెక్రటరీగా నాగేంద్ర ,జాయింట్ సెక్రెటరీ హరికృష్ణ ,ట్రెజరీ రాజా నాయక్, కమిటీ సభ్యులుగా సురేష్, భాను ప్రకాష్ ,సురేషు, రాజేంద్రప్రసాద్, వెంకటేశ్వర్లు ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్ ఎస్‌జి. గాది లింగన్న మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై నిరంతరంగా పోరాడుతానని అన్నారు.. నాపై ఎంతో నమ్మకంగా ఉన్నత పదవిని అప్పి చెప్పినందుకు ఎంతో బాధ్యతగా పనిచేస్తానన్నారు. రైతుల సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకొని వచ్చిన వెంటనే సత్వరమే పరిష్కరించే దిశగా ముందుకెళ్తానని అన్నారు.

దీక్షలలో అభివాదం చేస్తున్న నాయకులు

ఆదోని జిల్లా సాధనకు దీక్షలు

ప్రజాశక్తి - ఆదోని

రెవెన్యూ డివిజన్ కేంద్రం ఆదోనిని జిల్లాగా ప్రకటించాలని, పెద్ద హరివాణం గ్రామాన్ని మండలంగా గుర్తించాలని కోరుతూ గ్రామస్తులు దీక్షలకు కూర్చున్నారు. ఆదోని బీమాస్ కూడలిలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. పెద్ద హరివాణం గ్రామ వాసి ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాలు, అన్ని రంగాలలో వెనకబడిన పెద్ద హరివారం గ్రామాన్ని మండలంగా ప్రకటించాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాన్ని ఇచ్చి విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలన్నా ఆదోని జిల్లాగా ఏర్పాటు చేయాలని సరిహద్దు గ్రామమైన పెద్దహరివానం మండలంగా గుర్తించాలని డిమాండ్ చేశారు. వచ్చేస్థానిక సంస్థల ఎన్నికలను అవసరమైతే గ్రామంలో బహిష్కరిస్తామని హెచ్చరించారు. గ్రామస్తులు చేపట్టిన దీక్షకు జిల్లా సాధన కమిటీ కన్వీనర్ నూర్‌అహ్మద్ మద్దతు ప్రకటించారు. సామాజికంగా ఆర్థికంగా ఆదోని డివిజన్ వెనకబడి ఉందని జిల్లా ఏర్పాటు అయితేనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు.

కూటమి ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధి

- టిడిపి కన్వీనర్ లాయర్ షేక్షావలి

ప్రజాశక్తి-చిప్పగిరి

కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిన్నర లోపు గ్రామాలలో అభివృద్ధి ఏంటో చేసి చూపిస్తుందని మండల టిడిపి కన్వీనర్ లాయర్ షేక్షావలి, టిడిపి సీనియర్ నాయకులు సంగాల చంద్ర, పాముల సన్నప్ప అన్నారు. ఆదివారం ఆలూరు టిడిపి ఇన్‌ఛార్జి వైకుంఠంజ్యోతి, రాష్ట్రకార్యనిర్వాహక అధ్యక్షులు వైకుంఠం శివప్రసాద్ ఆదేశాల మేరకు రూ.20లక్షలు 15వ ఆర్థిక సంఘం నిధులుతో నేమకల్లు గ్రామంలోని కోటలో ఉన్న వీరభద్రప్పస్వామి ఆలయం దగ్గర నుంచి ప్రధాన రహదారి వరకు చేపట్టబోయే సిసిరోడ్డు నిర్మాణానికి టిడిపి నాయకులు తలారి సుంకన్న ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండలంలో ఎక్కువ సమస్య ఉన్న గ్రామాలకు సిసి రోడ్లు నిర్మాణాలు చేపట్టుటకు కూటమి ప్రభుత్వం రూ.ఒక కోటి పదిలక్షలు మంజూరు చేసిందన్నారు. గ్రామాలలో సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులను చేయటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. టిడిపి నాయకులు మాజీ ఎంపిటిసి భాస్కర్, తలారిశివ, ముద్దప్పబాష, రంగయ్య, అసిన్, వడ్డే గోవిందు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న నాయకులు

మానవ వ్యక్తిత్వాన్ని మలిచే 'జీవనసరళి '

పుస్తకావిష్కరణ సభలో వక్తలు

ప్రజాశక్తి- కర్నూలు కల్చరల్

మానవ జీవితంలో ఎదురయ్య అనేక సంఘర్షణలు సంక్లిష్టతలను వివరిస్తూ మావవుని వ్యక్తిత్వాన్ని మలిచేలా విజయులు తనగల 'జీవనసరళి' కవిత్వం అందించారని వక్తలు కొనియాడారు. ఆదివారం ఉదయం నగరంలోని టిజివి కళాక్షేత్రంలో జరిగిన పుస్తకావిష్కరణ సభకు సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ అధ్యక్షత వహించారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రముఖ కవి వెంకటకృష్ణ మాట్లాడుతూ కవిత్వం వస్తు ప్రధానంగా సాగుతుందని సామాజిక సమస్యలను ఇతివృత్తంగా కవిత్వం రాశారని అన్నారు. ముఖ్య అతిథి ప్రముఖ న్యాయవాది జయరాజు మాట్లాడుతూ సమాజంలో మనుషులు ఎదుర్కొనే అనేక సమస్యలను కవిత్వంగా రాయడం అరుదైన విషయమని ఈ కవి తెలుగు సాహిత్యంలో నిలబడతాడని అన్నారు. పుస్తకాన్ని సమీక్షించిన ప్రముఖ కథారచయిత ఇనాయతుల్లా మాట్లాడుతూ పుస్తకంలోని కవితలు మానవ జీవిత వ్యక్తిత్వ వికాసానికి అద్దం పడతాయని అన్నారు. ఈ రవితలు చదవడం వల్ల మనిషిలోని ఆలోచనలు సరైన మార్గంలో ప్రయాణం చేస్తాయని అన్నారు. రాయలసీమ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ మాట్లాడుతూ కవిత్వంలోని వస్తువులు భిన్నత్వాన్ని సాధించాయని, ఈ కవిత్వం ఆదరించదగ్గదని అన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు మాట్లాడుతూ జీవనసరళి కవిత్వంలో మానవీయ విలువలు నైతికత ఉందని, ఇది సమాజ క్షేత్రంలో అవసరమైనదని అన్నారు. సాహితీ స్రవంతి జిల్లా నాయకులు అకేపోగు నాగరాజు మాట్లాడుతూ కవిత్వంలోనే వాక్యాలు అక్షర విన్యాసం చేస్తాయని అన్నారు. కెఎన్ఆర్ పాఠశాల కరస్పాండెంట్ విశ్వనాథ్ మాట్లాడుతూ కవులు తెలుగు భాషా సాహిత్యాలను తమ రచనలతో కాపాడుతూ ప్రాణం పోస్తున్నారని అన్నారు. కవి విజయులు తనగల మాట్లాడుతూ తన కవిత్వానికి సాహితీ స్రవంతి వేదికనిచ్చిందని ఈ కవిత్వం ఇలా రావడానికి సాహితీ స్రవంతి అందించిన ప్రోత్సాహమే కారణమని, ఈ స్ఫూర్తితో ముందుకు సాగుతానని అన్నారు. అంతకుముందు ప్రజావాగ్గేయకారులు అందెశ్రీ మృతికి సభ సంతాపం తెలిపింది. కవులు మారుతీ పౌరోహితం, నాగేశ్వరాచారి, ఆవుల చక్రపాణి యాదవ్, సూర్యప్రకాశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సభలో నంది అవార్డు గ్రహీత మహమ్మద్ మియా పాడిన పాటలు అలరించాయి.

జీవన సరళి పుస్తకాన్ని ఆవిష్కరిస్తు కవి వెంకటకృష్ణ, తదితరులు

శుభకార్యాల్లో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయంలో ఆదివారం జరిగిన పలు శుభ కార్యాల్లో ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. రామచంద్ర నగర్ కాలనీలో చాకలి నల్లారెడ్డికి చెందిన నూతన గృహ ప్రవేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన సత్యనారాయణ స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. రాఘవేంద్ర భవన్ హోటల్ నిర్వహకులు ఖాసిం పీరా సోదరుడి ఇంట్లో జరిగిన వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యేతో పాటు వైసిపి మండల అధ్యక్షులు జి భీమారెడ్డి, నాయకులు జనార్ధన్ రెడ్డి ఉన్నారు.



ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి - మద్దికేర

నిరు పేదల ఆరోగ్య పరిరక్షణకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ పట్టణ అధ్యక్షులు గడ్డం రామాంజనేయులు, మాజీ జెడ్పిటిసి రాజన్న యాదవ్ అన్నారు. మండల కేంద్రమైన మద్దికేర కళ్యాణమండపంలో ఆదివారం శ్రీ భక్త కనకదాసు జయంతి సందర్భంగా కర్నూల్ అమీలియా హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయగా ముఖ్య అతిథిగా ఎస్సై విజయ్ కుమార్ నాయక్ రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. సుమారు 150 పైగా మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సర్పంచ్ ఆంజనేయులు, మాజీ సర్పంచ్ లక్ష్మన్న, సుధాకర్ టైలర్ హరి, హాస్పిటల్ వైద్యులు, కురువ సంఘం పెద్దలు పాల్గొన్నారు.

చద్దికెరలో ఉచిత వైద్య శిబిరం

మహారాజ శ్రీ కర్నూలు ప్రిన్సిపల్ ప్రిన్సిపల్ జిల్లా జడ్జి గారి కోర్టులో

ఐ.ఎ.నెం.1684/2024 ఇన్ ఐ.ఎ.నెం.537/2024

ఇన్ ఎ.యస్.నెం. /2024

వి.రాజేశ్వరి. ...అర్జీదారు/అప్పిలెంటు

-వర్సెస్-

వి.రామదాసు (Died by his L.Rs)
ఆర్.3. వి.లక్ష్మి భర్త లేటు వి.రామదాసు,
ఆర్.4. వి.రాజరాములు తండ్రి లేటు వి.రామదాసు,
ఆర్.5. వి.సురేంద్ర తండ్రి లేటు వి.రామదాసు,
ఆర్.6. వి.దేవి తండ్రి లేటు వి.రామదాసు,
అందరి నివాసము.కొట్టాల గ్రామం,వెల్దుర్తి మండలం,
కర్నూలు జిల్లా. ...రెస్పాండెంట్లు

రెస్పాండెంట్లు నెం.3 నుండి 6 వరకు నోటీసులు

ఇందుమూలముగా పైన కనబరచిన ఐ.ఎ.నెంబరులో 3 నుండి 6 రెస్పాండెంట్లు అయిన మిమ్మల్ని వి.రామదాసు (ఆర్.1) వారసులుగా పై కేసులో చేర్చమని కోరుతూ పై తెల్పిన అర్జీదారు ఐ.ఎ.నెం.1684/2024 పై కనబరచిన కోర్టులో అర్జీదాఖలు చేసినారు. సదరు విషయమై 3 నుండి 6 రెస్పాండెంట్లు అయిన మీకు ఆక్షేపణ ఉన్న యెడల 18-11-2025 వ తేది ఉదయం 10.30 గంటలకు మీరుకాని మీ తరపున అడ్వకేటు ద్వారా గాని పై కోర్టులో హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకొనవలయును. లేని యెడల సదరు అర్జీ నీ పరోక్షమున విచారించి తీర్మానింపబడును.

కోర్టు వారి ఉత్తర్వు మేరకు

వాయిదా : 18-11-2025

కె.లోకేశ్వరరెడ్డి,
వాది పరం అడ్వకేటు, కర్నూలు.

దేవాలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి- కౌతాళం

శ్రీ లక్ష్మీ నరసింహ ఉరుకుంద ఈరన్నస్వామి పుణ్యక్షేత్రం అభివృద్ధి కోసం బళ్లారి పట్టణానికి చెందిన నరసింహయ్యశెట్టి రూ.లక్ష విరాళంగా ఇచ్చారు. ఆదివారం ముఖ్య అర్చకులు నాగరాజ్ స్వామి దాతకు ప్రత్యేక దర్శనం సౌకర్యం కల్పించి స్వామి వారి శేష వస్త్రాలను, ప్రసాదాలిచ్చారు.

FORM NO. 14
[See Regulation 33(2)]
By Regd. A/D, Dasti failing which by Publication.

OFFICE OF THE RECOVERY OFFICER - I/II
DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD(DRT 2)
1st Floor, Triveni Complex Abids, Hyderabad 500001

DEMAND NOTICE

NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME TAX ACT, 1961.

RC/303/2019 **06-11-2025**

Union Bank of India (Earlier Corporation Bank)
Versus
New Dream World Mens Wear& Others

To
(CD 1) New Dream World Mens Wear, Represented By Its Prop.Shaik Nazeer, S/o Shaik Syda, Shop No.20, Haji Gulamhussain Arcade, Opp:Zilla Parishad, Kurnool, Andhra Pradesh-518 001.
(CD 2) Sri. Shaik Nazeer, S/o.Shaik Syda, R/o H.No.40/468, Fisheries Compound, B.Camp, Kurnool,A.P. 518 002.
(CD 3) Sri. G. Madan Mohan, R/o Plot No.28, 28A, Mamatha Nagar, Venkat Ramana Colony, Hyderabad-500 024.

1. This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Presiding Officer, **DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD (DRT 2)** in **OA/821/2018** an amount of **Rs.13,74,762.00 (Rupees Thirteen Lakhs Seventy Four Thousands Seven Hundred Sixty Two Only)** along with pendentellite and future interest @12.50% Simple Interest Yearly w.e.f. **10.04.2019** till realization and costs of Rs.**0/- (Only)** has become due against you (Jointly and severally/ Fully/Limited).
2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.
3. You are hereby ordered to declare on an affidavit the particulars of yours assets on or before the next date of hearing.
4. You are hereby ordered to appear before the undersigned on **01/01/2026 at 10:30 a.m**. for further proceedings.
5. In addition to the sum aforesaid, you will also be liable to pay: (a) Such interests as is payable for the period commencing immediately after this notice of the certificate/execution proceedings. (b) All costs, charges and expenses incurred in respect of the service of this notice and warrants and other processes and all other proceedings taken for recovering the amount due.

Given under my hand and the seal of the Tribunal, on this date: 06/11/2025
Recovery Officer
DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD(DRT 2)